
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 16 । మే । 2025



సదరం క్యాంప్

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. 50 మంది దివ్యాంగులు పరీక్షలు చేయించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం గురువారం 512.70 అడుగుల వద్ద ఉంది. ఇది 136.300 టీఎంసీలకు సమానం.



దుర్గమ్మకు వెండి పంచపాత్ర

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు కృష్ణా జిల్లా పూర్వ కలెక్టర్ జి.లక్ష్మీకాంతం దంపతులు గురువారం వెండి పంచపాత్ర సమర్పించారు.

న్యూస్‌రీల్

మహాకుంభాభిషేక పూజలు ప్రారంభం



అద్దంకి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి నూతన విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో నిర్వహించతలపెట్టిన మహాకుంభాభిషేక కార్యక్రమం గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. దానిలో భాగంగా స్వామివారికి కలశం సమర్పించిన నలమలపు విజయభాస్కరరెడ్డి దంపతులు కలశ అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ తిమ్మనాయుడు, సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరత నాట్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వైభవంగా శ్రీకారం



తెనాలి: స్థానిక శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున ఉదయం 11 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. దేవస్థాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటలకు అంకురారోపణ, ధ్వజారోహణ చేశారు. సాయంత్రం 6.30 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవాన్ని జరిపారు. ఆలయ సహాయ కమిషనర్/కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తిరుమలగిరి హుండీ ఆదాయం రూ. 26.41 లక్షలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.26,41,390 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు. ప్రాంగణంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. గత నెలలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కానుకల లెక్కింపులో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్ కల్యాణ్, పరిటాల సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. లెక్కింపు సమాచారాన్ని ఆలయ పాలక వర్గానికి ఇవ్వలేదని లెక్కింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇటీవల జరిగిన కల్యాణ మహోత్సవాల్లో ఈవో ఇష్టానుసారం డబ్బు ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వచ్చి గ్రామస్తులకు సర్దిచెప్పారు. ఆ సమయంలో ఆలయ ఈవో కార్యాలయంలో లేరు. తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు ఇద్దరు వ్యక్తులపై ఆలయ ఈవో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వెంకటపాలెం యూపీ పాఠశాలలో చోరీ



తాడికొండ: తుళ్ళూరు మండలం వెంకటపాలెం యూపీ స్కూల్లో దొంగతనం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెచ్‌ఎం జానకీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... ఇటీవల ప్రధానమంత్రి రాక నేపథ్యంలో వసతి కోసం పోలీసులకు పాఠశాలను ఇచ్చామని, కార్యక్రమం అనంతరం ఆఫీసు గదిలో ఉన్న రూ.20 వేల పెద్ద సౌండ్ బార్, రూ.3 వేల చిన్న సౌండ్ బాక్స్ చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

కాటేస్తున్న కాల్ నాగులు

- పట్టి పీడిస్తున్న వడ్డీ జలగలు
- అసలుకు నాలుగింతలు కట్టినా వేధింపులు
- దాడులకు పాల్పడుతున్న వడ్డీ వ్యాపారులు
- పోలీసుల తూతూ మంత్రపు చర్యలు
- ఇల్లు, గ్రామం విడిచి పారిపోతున్న బాధితులు



విజయనగర్ కాలనీలో వడ్డీ డబ్బులు ఇవ్వలేదని ఇంటికి తాళం వేసిన వ్యాపారులు



ఇంట్లో బీరువాను చెల్లాచెదురు చేసిన వడ్డీ వ్యాపారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చీరాల నియోకవర్గంలో కాల్ నాగులు బుసకొడుతున్నాయి. అవసరానికి అప్పు తీసుకున్న పాపానికి సామాన్యులను నిత్యం వేధిస్తున్నాయి. అసలుకు నాలుగింతల వడ్డీ కలిపి ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. అప్పు తీసుకున్న వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రెచ్చిపోతూ మానవత్వం మరిచి నీచంగా ప్రవర్తిస్తున్నాయి. బాధితులు ఇల్లు, గ్రామ విడిచి పారిపోయేలా చేస్తున్నాయి. ప్రజలు వడ్డీ జలగల వలలో చిక్కుని ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏకంగా బాధితుల ఇళ్ల పైకి వెళ్లి దాడులకు పాల్పడుతున్నారు. నగదు కట్టకపోతే ఇంటికి తాళాలు వేసి బాధితులను ఇంటి నుంచి బయటకు గెంటుతున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని పోలీస్‌స్టేషన్‌కి వెళ్లిన బాధితులకు న్యాయం జరగడంలేదని వాపోతున్నారు.

వేధింపులు, దౌర్జన్యాలు..

- వడ్డీకి ఇచ్చిన నగదు ఏదైనా కారణంతో బాధితులు కట్టలేకపోతే వారికి వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు మొదలవుతాయి. అంతటితో ఆగకుంటా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. బాధితుల ఇళ్లపై దాడి చేసి వారి ఇళ్లకు తాళాలు వేసిన సంఘటన ఉన్నాయి. ఎదురు తిరిగి మాట్లాడితే దాడికి పాల్పడుతున్నారు. వడ్డీ వ్యాపారుల వేధింపులు, దౌర్జన్యాలు తాళ లేక బాధితులు ఇల్లు, గ్రామం విడిచి పారిపోయిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు.



న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

- దేశాయిపేట పంచాయతీ విజయనగర్ కాలనీకి చెందిన షేక్ ఖజీ మొఘల్ బెల్దారు పనులు చేస్తూ జీవిస్తుంటారు. ఆర్థిక ఇబ్బందులతో అదే ప్రాంతానికి చెందిన దంపతుల వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. దానికి సంబంధించి రూ.1.30 లక్షలు తిరిగి చెల్లించినట్లు బాధితులు తెలిపారు. అయినప్పటికీ ఇంకా రెండు లక్షలు చెల్లించాలని లేదంటే చంపేస్తామని బెదిరించి ఇంటిపై దాడి చేసి ఇంట్లో నుంచి బయటకు నెట్టి ఇంటికి తాళాలు వేసినట్లు బాధితులు తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.
- వడ్డీ వ్యాపారుల బెదిరింపులు, దాడులకు భయపడి రామానగర్ మూడోలైనుకి చెందిన ఒక కుటుంబ మూడు నెలల కిందట ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లిపోయింది.
- రామన్నపేట పంచాయతీ స్ట్రయిట్ కాలవ కట్టపై నివాసం ఉంటూ ఆటో నడుపుకుంటున్న రెండు కుటుంబాలు వడ్డీ వ్యాపారుల దాడులకు భయపడి మూడు నెలల కిందట ఇల్లు వదిలి కుటుంబాలతో గుంటూరు తరలిపోయారు.
- అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో ఒక కుటుంబం వడ్డీ వ్యాపారుల వేధింపులతో ఇల్లు విడిచి వెళ్లిన సంఘటన ఉంది.
- రామన్నపేట పంచాయతీ అచ్చుకట్లలంపలో నివాసం ఉంటున్న కుటుంబం తమ కుటుంబ అవసరాల కోసం అప్పు చేయడంతో వడ్డీ వ్యాపారులు వేధింపులు, దాడులతో ఇల్లు విడిచి 8 నెలల కిందట హైదరాబాద్ వెళ్లిపోయారు.
- ఇప్పటికైనా ఉన్నత అధికారులు కాల్‌మనీ వడ్డీ వ్యాపారుల బారి నుంచి పేద ప్రజలకు కాపాడాలని కోరుతున్నారు.

వడ్డీ వ్యాపారం తీరుతెన్నులు..

దేశాయిపేట పంచాయతీ విజయనగర్ కాలనీకి చెందిన ఒకరు, ఈపురుపాలెం నుంచి వచ్చి విజయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న మరొకరు. చీరాల–వేటపాలెం రోడ్డు పక్కన వేటపాలెం ఆర్టీసీ పెట్రోల్ బంక్ దగ్గరలో మరో ఇద్దరు, రాపూరిపేట అచ్చుకట్లలంపలో నలుగురు మహిళలు, కొత్తపేటలో మరొకరు ఇదే విధంగా మరి కొందరు కొంత మొత్తంలో నగదు అప్పుగా ఇస్తారు. రూ.10 వడ్డీగా వసూలు చేస్తారు. ఇచ్చిన అప్పును కిస్తీల రూపంలో ప్రతి రోజూ కొంత మొత్తంగా నగదు చెల్లించేలా అవగాహన కుదుర్చుకుంటారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

మహిళలకు జీవనోపాధి కల్పనే ధ్యేయం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పొదుపు సంఘాలలోని 30 వేల కుటుంబాలకు జీవనోపాధులు కల్పించడం, వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పేర్కొన్నారు. పొదుపు మహిళల జీవనోపాధుల కార్యకలాపాలు, ఆర్థికాభివృద్ధి అంశాలపై సమావేశం బాపట్లలోని సాయిరామ్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. డీఆర్‌డీఏ, మెప్మాలోని క్షేత్రస్థాయి పట్టణ, గ్రామ సంఘాల నాయకులకు మెగా వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలయ్యే పథకాలు, రాయితీలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. సీడాప్ ద్వారా నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణలు, ఉద్యోగ అవకాశాలపై రూపొందించిన పోస్టర్‌లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లాను ప్రథమంగా నిలిపి ఏపీ గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం, అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని అధికారులు, గ్రామ సంఘాల నాయకులు సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందని అన్నారు. వారంతా నికర ఆదాయం సాధించేలా చైతన్య పరచాలని సూచించారు. బాపట్ల జిల్లాలో 33,390 పొదుపు సంఘాలు ఉండగా అందులో నాలుగు లక్షల కుటుంబాలు సభ్యులుగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ముప్పై వేల కుటుంబాల జీవన స్థితిగతులను మార్చడానికి కార్యోన్ముఖులు కావాలని వారిలో స్ఫూర్తి నింపారు. సూర్య ఘర్ పథకంతో ప్రకృతికి మేలు ఇస్తూనే సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలో 60 వేల గృహాలకు సౌర విద్యుత్ యూనిట్లు స్థాపించడం లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కె.శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల జిల్లా పర్యాటక రంగంగా అభివృద్ధి జరగనుంద న్నారు. జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ద్రాక్షావల్లి, సీపీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, ఎల్‌డీఎం శివకృష్ణ, మెప్మా పీడీ పి.శ్రీహరి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పనులు వెంటనే చేపట్టాలి

నీటి పారుదల శాఖలోని ఆపరేషన్, నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని బాపట్ల, వేమూరు, రేపల్లె, పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో నీటిపారుదుల శాఖకు ఆపరేషన్, నిర్వహణ కింద మొత్తం 454 పనులకు రూ.12 కోట్ల నిధుల మంజూరుకు కేబినెట్ ఆమోదం పొందిందని తెలిపారు. తాగునీటికి సంబంధించి ఈనెల 10వ తేదీన నీటిని నిలుపుదల చేసినందున, మరమ్మతులు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి సరఫరా, నిల్వలపై బాపట్ల మున్సిపల్ కమిషనర్‌ను అడిగి ఆరా తీశారు. గుంటూరు, నీటిపారుదల శాఖ ఎస్ఈ పి వెంకటరత్నం పాల్గొన్నారు.

అస్థిపంజరం కలకలం

- మహిళదా, పురుషుడిదా అని నిర్ధారించలేని పరిస్థితి
- గుట్టుచప్పుడు కాకుండా ఎముకలను తొలగించిన పోలీసులు
- హత్య కేసులు పెరుగుతున్నా ఆధారాల సేకరణలో నిర్లక్ష్యం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసులు గుట్టుచప్పుడు వ్యవహరిస్తున్నారు. అసలు ఆ ఘటనలను బయటకు రానీయకుండా జాగ్రత్త పడుతూ కేసులను నీరు గారుస్తున్నారనే విమర్శలు తరచు వినిపిస్తున్నాయి. ఆలస్యంగా ఇలాంటి ఘటనే గురువారం వెలుగులోకి వచ్చింది. వడ్డేశ్వరం – ఇప్పటం బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ముళ్ల పొదల్లో గుర్తుతెలియని అస్థిపంజరం ఉన్నట్లు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందింది. గత ఆదివారం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గుట్టుచప్పుడు కాకుండా ఎముకల గూడును అక్కడి నుంచి తరలించారు. జనసంచారం లేని ఆ ప్రాంతంలో ముళ్లపొదల్లో మూడు నాలుగు నెలల క్రితం మృతదేహాన్ని పడవేసి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు.

ఆధారాల సేకరణలో నిర్లక్ష్యం

పోలీసులు బయటకు తీసిన అస్థిపంజరం పురుషునిదా? లేదా మహిళదా? అనేది నిర్ధారించడానికి కూడా వీలులేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆధారాలు సేకరించడంలో నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మృతదేహంపై దుస్తులు ఉంటే వాటికి సంబంధించి మగవారు అయితే షర్ట్ బటన్లు, ప్యాంట్ బకిల్స్, జిప్ లాంటివి లభించేవి. ఆడవారు అయితే హెయిర్ పిన్స్ కానీ, జాకెట్ హుక్స్ కానీ ఉండేవి. ఎవరైనా చంపి ఆధారాలు లభించకుండా దుస్తులను తీసివేసి ఆ మృతదేహాన్ని ఇక్కడ పడవేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

సబ్ డివిజన్‌లో పెరిగిన హత్యలు

ఈ మధ్యకాలంలో మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలో వేశ్యలు, ట్రాన్స్‌జెండర్స్ ఎటువంటి జన సంచారం లేని ప్రాంతాల్లో తిరుగుతూ తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో గొడవలు ఏర్పడినపుడు, ఆధిపత్య పోరు వచ్చినప్పుడు హత్యలు కూడా జరుగుతున్నాయి. తాడేపల్లి రూరల్‌లోని కొలనుకొండలో ఓ సంఘటన చోటుచేసుకుంది. అదే ప్రాంతంలో గుంటూరు చానల్ ఒడ్డున ఓ మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభించింది. పెదవడ్లపూడి – కాజ మధ్య పొలాల్లోని బీటీ రోడ్‌లో ఓ ట్రాన్స్‌జెండర్ తన ప్రియుడి కోసం మరో వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. ఇన్ని సంఘటనలు జరిగినా తాడేపల్లి పోలీసులు మాత్రం అస్థిపంజరం ఉందన్న సమాచారం అందిన వెంటనే ఎటువంటి విచారణ చేయకుండా ఆ అస్థిపంజరాన్ని గుట్టుచప్పుడు కాకుండా మార్చురీకి తరలించారు. మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలలో ఎముకల గూడుకు పోస్టుమార్టం చేయలేమని చెప్పడంతో పోలీసులు గుంటూరులోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు విశ్వసనీయ సమాచారం.

అడ్డదిడ్డంగా సర్కార్ ప్లాన్

- భవన నిర్మాణ అనుమతుల నూతన జీవోపై తీవ్ర వ్యతిరేకత
- ఎల్‌టీపీలు, సర్వేయర్లను బాధ్యులను చేసేలా నిబంధనలు
- ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నిలిచిన ఇంటి ప్లాన్ల తయారీ
- అడ్డగోలు నిబంధనలతో ఆమోదం కోసం రాని దరఖాస్తులు
- అవగాహన ప్రచారం పేరిట ఆపసోపాలు పడుతున్న అధికారులు



అపోహలు వద్దంటూ స్థానిక శివాజీ చౌక్‌లో ప్రచార ఫ్లెక్సీ

తెనాలి: భవన నిర్మాణాలకు అనుమతులకు సంబంధించి కొత్త విధానంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరిలో జీవో జారీ చేసింది. సాంకేతిక కారణాలతో మార్చి నెల నుంచి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం చెప్పిన ప్రకారం ఈ విధానంలో భవన నిర్మాణాలకు అనుమతుల కోసం కార్పొరేషన్లు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ యజమానులు తిరగాల్సిన పనిలేదని పేర్కొన్నారు. అధికారులు కొర్రీలు పెట్టి వేధిస్తారన్న ఆందోళన అవసరం లేదన్నారు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ, లైసెన్స్‌డ్ సర్వేయర్) ద్వారా భవన నిర్మాణానికి దరఖాస్తును పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, గంటల వ్యవధిలోనే అనుమతులు పొందవచ్చని చెప్పారు. నిబంధనలకు లోబడి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను కూడా పొందవచ్చని తెలిపారు. ఈ విధానంలో 18 మీటర్ల ఎత్తులోపు అయిదు అంతస్తుల్లో నిర్మాణాలకు సులభతరం చేస్తూ ప్రభుత్వం 'స్వీయ ధ్రువీకరణ పథకం' తీసుకొచ్చింది. అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి ఉంచింది.


బాధ్యతంతా వారిదే..

దరఖాస్తులు, వాటికి అనుబంధ పత్రాలు అప్‌లోడ్ చేసిన నాటి నుంచి నిర్మాణ పనులు పూర్తి చేసే వరకు అన్ని దశల్లోనూ టెక్నికల్ పర్సన్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఇంటి యజమానులు, నిర్మించిన కట్టడాల్లో ఏవైనా సాంకేతికపరంగా తప్పులు చేసినట్టు నిర్ధారణ అయితే సంబంధిత లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ లైసెన్సును అయిదేళ్లపాటు రద్దు చేస్తామని పేర్కొంది. తప్పు తీవ్రత ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశమూ ఉందని తెలిపింది. ఆమోదిత లే అవుట్లలోని ప్లాట్లలోనే నిర్మాణాలు చేయాలని షరతు విధించింది. యాజమాన్య హక్కులు కలిగి ఉండాలని తెలిపింది. సర్వే రిపోర్టు, స్థలం విలువ ఆధారిత సర్టిఫికెట్ వంటివి తప్పనిసరి చేశారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యహరించినట్టు ఆకస్మిక తనిఖీల్లో వెలుగు చూస్తే అనుమతులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్లాను ఇచ్చిన తర్వాత యజమాని ఎక్కడైనా ఉల్లంఘిస్తే తమదెలా బాధ్యత అవుతుందని ఎల్‌టీపీలు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు ప్రశ్నిస్తున్నారు. మార్గదర్శకాలను బేఖాతరు చేస్తూ నిర్మాణం చేసినపుడు మేమే సమాచారం ఇవ్వాలట! అధికారులు వచ్చి కూలగొడతారట... ఇదేం న్యాయం...' అంటూ ప్లానర్లు ఆందోళన చెందుతున్నారు. ఇంటి ప్లాను కోసం వచ్చిన వారికి ఇదే చెప్పడంతో తిరిగి వెళ్లిపోతున్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సొంతూళ్లలో ఇళ్ల నిర్మాణాన్ని మానుకొని, ఉంటున్న నగరంలోనే అద్దె ఇళ్లలో కొనసాగటమో.. అక్కడే ఏదైనా ప్లాటు కొనుక్కోవటమో చేస్తున్నారు. మరోవైపు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్, వారి దగ్గర పనిచేసేవారు ఉపాధి కోల్పోతున్నారు.

అధికారులందరూ ఏం చేస్తారో?

తెనాలి మున్సిపాలిటీ వరకు చూసుకుంటే లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు 22 మంది ఉంటారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్లాన్లు గీసి ఉపాధిని పొందుతుంటారు. పట్టణంలో నెలకు 40–45 వరకు ప్లాన్లు ఇస్తుంటారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన పథకంలో ప్లాను గీసే బాధ్యతతోపాటు కచ్చితంగా ఆ ప్రకారం ఇల్లు/భవనాన్ని నిర్మించేలా చూడాల్సిన బాధ్యతనూ వీరిపై ఉంచింది. పట్టణ మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ఉంటారు. అనధికార నిర్మాణాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ఈ విభాగంపైనే ఉంది. అయినా కేవలం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లపైనే భారం మోపటం విమర్శలకు దారితీస్తోంది. నూతన విధానం కింద 60, 100, 150 గజాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి చాలా ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలకు వసూలు చేస్తున్న ఫీజులు అధికం. దీనికితోడు కఠిన నిబంధనలతో చిన్న స్థలాల్లో ఇంటి నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. అందుకోసమే గ్రామాల్లో ప్లాన్లు లేకుండానే ఇళ్ల నిర్మాణం చాలా కాలంగా జరుగుతోంది. సగటున పది ఇళ్లు నిర్మిస్తుంటే, ఒక ఇంటికి మాత్రమే ప్లాను గీయిస్తున్నారని, ఇప్పటివరకు జరిగిన ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుందని చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



ఇంటి ప్లాన్ల దరఖాస్తు ప్రక్రియ నిలిచిపోవటంపై ప్రభుత్వానికి నివేదించాం. నూతన జీవోలో రెండు సవరణలు చేశారు. ప్రస్తుతమున్న ప్లానర్లు కావాలని ప్రజల్లో అపోహలు సృష్టించారు. భవన నిర్మాణం చేయదలచినవారు పట్టణ ప్లానింగ్ అధికారులు లేదా హెల్ప్ డెస్క్‌ను సంప్రదిస్తే ప్లాను ఇస్తారు. కొత్తగా అర్హత కలిగిన ప్లానర్లు ఎవరైనా ముందుకొస్తే లైసెన్సులు ఇస్తాం. వారి చేత ప్లాన్లు తీసుకోవచ్చు.

– మధుకుమార్, రీజినల్ డెప్యూటీ డైరెక్టర్, టౌన్‌ప్లానింగ్ విభాగం

నిత్యాన్నదానానికి పలువురు భక్తుల విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గురువారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. హిందూపూర్‌కు చెందిన బి.నవీన్ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ శీనానాయక్‌ను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందచేశారు. విజయవాడ భవానీపురానికి చెందిన శీలం సాయి ఫణీంద్ర కుటుంబం నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం సమర్పించింది.

క్యాన్సర్ రోగులకు శుభవార్త

- జీజీహెచ్‌లో రూ. 18 కోట్లతో పెట్ సీటీ స్కాన్ వైద్య పరికరం
- తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు



గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు అందించేందుకు పెట్ సీటీ స్కాన్ వైద్య పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్సలను ఉచితంగా అందించేందుకు నాట్కో ట్రస్టు చైర్మన్ వి.సి.నన్నపనేని సుమారు రూ.50 కోట్లతో జీజీహెచ్‌లో వంద పడకలతో ఐదంతస్తుల క్యాన్సర్ వార్డు నిర్మించారు. తాజాగా రూ. 20 కోట్లతో మరో క్యాన్సర్ భవన నిర్మాణం చేస్తున్నారు. ప్రతి ఏడాది రూ.కోట్లాది విలువైన క్యాన్సర్ మందులను సైతం నాట్కో ఫార్మా వారు ఉచితంగా అందజేస్తున్నారు. నాట్కో ట్రస్టు క్యాన్సర్ రోగులకు చేస్తున్న సేవలకు మరింత మెరుగైన వైద్యం అందించేలా సుమారు రూ.18 కోట్లతో ప్రభుత్వం వైద్య పరికరాన్ని జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు అందజేసింది. క్యాన్సర్ శరీరంలో ఏ భాగంలో ఉంది, ఇతర భాగాలకు క్యాన్స ర్ సోకుతుందా, లేక అక్కడే ఉందా, అనే పూ ర్తి విషయాలు తెలుసుకునేందుకు పెట్ సీటీ స్కాన్ వైద్య పరికరం ఉపయోగపడుతుంది. ప్రైవేటు క్యాన్సర్ ఆసుపత్రుల్లో ఈ పరీక్ష చేయించేందుకు సుమారు రూ.25 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు. జీజీహెచ్‌లో వైద్య పరికరం అందుబాటులోకి రావడం ద్వారా పేద క్యాన్సర్ రోగులకు మేలు చేకూరనుంది. త్వరలోనే ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **4,000** గరిష్టం : రూ. **5,800**

మోడల్ ధర రూ. **5,000**

-తెనాలి



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **1115**

కొమ్ములు : **836** బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
10,000	11,700	11,100

కాయలు : **279** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	11,150	10,720

మొత్తం అమ్మకాలు : **836.250** క్వింటాళ్లు

-దుగ్గిరాల

క్లుప్తంగా

18న పవర్ లిఫ్టర్ల ఎంపిక

మంగళగిరి: ఈ నెల 18వ తేదీన గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి ఫిట్ జోన్‌నందు గుంటూరు జిల్లా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ మెన్, ఉమెన్, బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధానిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 నుంచి 2వ తేదీ వరకు ఒంగోలులో జరిగే పోటీలకు గుంటూరు జిల్లా టీంను ఎంపిక చేస్తామన్నారు. పాల్గొనే వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసు కుని 18వ తేదీన ఉదయం 8 గంటలకు రావాలన్నారు. వివరాలకు 97008 44497, 39463 07979 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్ధరాత్రి వేళ ఇసుక అక్రమ రవాణా



తాడికొండ: తుళ్ళూరు మండలంలో ఇసుక అక్రమ రవాణా అర్ధరాత్రి యథేచ్ఛగా కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణాను మైనింగ్ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఇక్కడ మాత్రం పగలు ఉచితం పేరుతో ట్రాక్టర్లలో తరలించి డంప్ చేసుకున్న ఇసుకను రాత్రిళ్లు జేసీబీల సాయంతో లారీలకు లోడ్ చేసుకొని యథేచ్ఛగా తరలించి జేబులు నింపుకొంటున్నారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉండటంతో తుళ్ళూరు, తాడికొండ పోలీస్ స్టేషన్ల మీదుగానే అక్రమ రవాణా కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదు. లారీలతో పాటు ట్రాక్టర్లలో కూడా రాత్రిళ్లు, తెల్లవారు జామున ఇసుక తరలిస్తున్నారు. సంబంధిత మైనింగ్, రెవెన్యూ తదితర అధికారులు ఇకనైనా స్పందించి అక్రమ రవాణాను అరికట్టి ప్రభుత్వ ధనానికి గండిపడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

చేయి తిరిగేలా క్రీడా శిక్షణ

- హ్యాండ్‌బాల్ క్రీడలో ఉచితంగా తర్ఫీదు
- 'శాప్', డీఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో తెనాలిలో గల క్రీడాస్టేడియం ఇప్పుడు శిక్షణకు వేదికగా నిలిచింది. వేసవి సెలవుల్లో ఇండోర్, ఔట్‌డోర్ ఆటల్లో చిన్నారులు సాధన చేస్తున్నారు. హ్యాండ్‌బాల్ అకాడమీ నడిచిన ఈ స్టేడియంలో ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఎన్ఐఎస్ కోచ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు.



క్రీడా శిక్షణ ఇస్తున్న దృశ్యం

తెనాలి: పట్టణ పరిధి చెంచుపేటలోని అమరావతి కాలనీలో డీఎస్ఏ స్టేడియానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో సకల వసతులు సమకూరిన విషయం తెలిసిందే. చేపట్టిన నిర్మాణాలు, దాతల సహకారంతో అందిన సౌకర్యాలతో పూర్తిస్థాయిలో క్రీడలకు సంసిద్ధం చేశారు. దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేనివిధంగా ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 'శాప్' ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ అకాడమీ నడిచింది. తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ల సంస్థ యాజమాన్యం ఇందుకు సహకరించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అకాడమీని పక్కన పెట్టారు.

ఉదయం, సాయంత్ర వేళల్లో...

ప్రస్తుతం వేసవిలో శాప్ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్‌లో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రీడలో తెనాలికి గల ప్రాభవాన్ని దృష్టిలో ఉంచుకొని శిబిరం ఏర్పాటు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి శిబిరం నడుస్తోంది. 23 మంది ఉచితంగా శిక్షణ తీసుకుంటున్నారు. కొందరు అండర్-14, అండర్-17, సబ్‌జూనియర్ కేటగిరీల్లో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో ఆడిన వారూ ఉన్నారు. కొత్తగా నేర్చుకునే ఆసక్తి కలిగిన వారూ వస్తున్నారు. రోజూ ఉదయం 6-8 గంటలు, సాయంత్రం 4-7 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. స్టేడియం హ్యాండ్‌బాల్ కోచ్ నాగరాజు సెలవులో ఉండటంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్), పాటియాలలో శిక్షణ పొందుతున్న హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పి.కాలేబును కోచ్‌గా నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఫిట్‌నెస్, క్రీడలో టెక్నిక్స్, స్కిల్స్ నేర్పుతున్నారు. ఈ నెలాఖరు వరకు జరిగే శిబిరాన్ని అవసరమైతే మరో రెండు వారాలు పొడిగించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నాం

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) ఆధ్వర్యంలోని తెనాలి స్టేడియంలో హ్యాండ్‌బాల్ కోచ్‌గా నన్ను నియమించారు. నా పర్యవేక్షణలో వేసవి క్రీడాశిబిరం నడుస్తోంది. గతంలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాను. ఎన్ఐఎస్‌లో శిక్షణ తీసుకుంటూ నాకున్న అనుభవంతో వేసవి శిబిరంలో శిక్షణ ఇస్తున్నా. క్రీడాకారులకు ఇదో మంచి అవకాశం . వారిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నా.

– పి.కాలేబు, కోచ్



తర్ఫీదు పొందుతున్న వారితో కోచ్

ఆట మెరుగయ్యేందుకు అవకాశం



నేను గత మూడేళ్లుగా హ్యాండ్‌బాల్ సాధన చేస్తున్నా. గతేడాది చండీఘర్‌లో జరిగిన అండర్-14 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఈ సంవత్సరం సబ్ జూనియర్ విభాగంలో జరిగిన జాతీయ పోటీల్లోనూ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. ఈ క్రీడలో రాణించి ఆర్మీలో చేరాలనేది నా లక్ష్యం. ఆటను మెరుగు పరుచుకునేందుకు ఇదో అవకాశమని భావిస్తున్నా.

-ఎం.విజేష్, 9వ తరగతి

మరింత రాణించడమే లక్ష్యం



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మూడేళ్లుగా హ్యాండ్‌బాల్ సాధన చేస్తున్నా. గతంలో అండర్-14, సబ్ జూనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడా. ఆయా కేటగిరీల్లో జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించాను. ఇండియన్ రైల్వేస్ హ్యాండ్‌బాల్ జట్టులో ఆడాలనేది నా కోరిక. క్రీడా కోటాలో జాబ్ సంపాదించాలంటే నిరంతర సాధన అవసరం. దానికితోడు శిక్షణతో మరింత మెరుగ్గా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

- ఎస్.హదస్స, 9వ తరగతి

జాతీయ పోటీలకు చేరేలా సాధన



హ్యాండ్‌బాల్ అంటే నాకు ఎంతో ఇష్టం . రెండు సంవత్సరాలుగా సాధన చేస్తున్నా. అండర్-14, అండర్-17, సబ్ జూనియర్ కేటగిరీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఆడాలని భావిస్తున్నాను. ప్రస్తుత వేసవి శిక్షణ శిబిరం ఇందుకు ఉపయోగపడుతోంది.

- ఆర్.దీక్షిత ఠాగూర్, 9వ తరగతి

సర్కారు తీరుతో 'పాఠశాల విద్య'లో గందరగోళం



లక్ష్మీపురం: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను జీవో నెం. 19, 20, 21ల ద్వారా 9 రకాలుగా విభజించి వేల సంఖ్యలో ఉపాధ్యాయులను మిగులుగా చూపించి పాఠశాల విద్యా వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం గందరగోళానికి గురి చేస్తోందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రఘునాథ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు కొత్తపేట జిల్లా సీపీఐ కార్యాలయంలో మల్లయ్య లింగం భవన్‌లో ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఉన్న జీవో నెం .117 అనేది ఉన్నత పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. దాన్ని రద్దు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన మూడు జీవోలు దాంతోపాటు ప్రాథమిక పాఠశాల వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల ప్రమోషన్లను గండి కొట్టేలా నిర్ణయాలు ఉన్నాయన్నారు .ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులను మూడు రకాలుగా విభజించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్టీయూ ప్రధాని కార్యదర్శి కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ బదిలీల విషయంలో ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు తెచ్చి ఆవేదనకు గురి చేస్తోందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వర రావు, రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ ప్రకాష్ రావు ఆయా సభ్యులు అడిగిన విషయాలను వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లబర్లీ రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో దయనీయంగా కౌలు రైతుల పరిస్థితి
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు



ధర్నా చేస్తున్న రైతు, కౌలు రైతుసంఘాల నాయకులు, రైతులు

నరసరావుపేట: పొగాకు కొనుగోలు కంపెనీ ప్రతినిధుల మాటలు నమ్మి నల్లబర్లీ పొగాకు సాగుచేసిన రైతులు నిలువునా మునిగిపోతున్నారని, ప్రభుత్వం సైతం వారి గోడు పట్టించుకోవడం లేదని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద పొగాకు రైతులతో ధర్నా నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో నల్లబర్లీ పొగాకును కనీస మద్దతు ధర రూ.15వేల నుంచి రూ.18వేల వరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత ఏడాది ధర కాస్త ఆశాజనకంగా ఉండడం, కంపెనీ ప్రతినిధులు గ్రామాల్లో తిరిగి రైతులను సంప్రదించి ఇతర పంటలు సాగు చేయొద్దని, నల్లబర్లీ సాగుచేస్తే మంచి ధర చెల్లిస్తామని నమ్మించారన్నారు. తీరా పంటచేతికి వచ్చాక కంపెనీలు మొత్తం సిండికేట్‌గా ఏర్పడి రైతులను లూటీ చేసేందుకు సిద్ధమయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మోసాన్ని ప్రభుత్వం చోద్యంగా చూస్తుందని ఎద్దేవా చేశారు. పర్చూరు, ఇంకొల్లు తదితర ప్రాంతాలలో పొగాకు సాగుచేపట్టిన రైతులు, కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఎంత మంది ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం స్పందిస్తుందని ప్రశ్నించారు. ఇటీవల ఉద్యాన పంటలపై సమీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఎకరాకు రూ. లక్ష ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెబుతున్న వ్యాఖ్యలు గారడీ మాటలను తలపిస్తున్నాయన్నారు.

స్పందించకుంటే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం..

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో వందేళ్ల చరిత్రలో పండించిన పొగాకులో 30శాతం మాత్రమే భారతదేశంలో వినియోగిస్తున్నారని 70 శాతం విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, ఇంత డిమాండ్ ఉన్నప్పటికీ ఎగుమతి చేసే పొగాకును కంపెనీలు ఎందుకు కొనడంలేదని ప్రశ్నించారు. పొగాకు కొనుగోలుకు ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకు రాకపోతే ఈనెల చివరిలో రైతులను ఏకంచేసి ఛలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, ఉపాధ్యక్షుడు గుంటూరు విజయకుమార్ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విస్తృత అవగాహన కల్పించాలి

గుంటూరుమెడికల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత బృందాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించి హెచ్ఐవీ బారిన పడకుండా కాపాడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మీ అన్నారు. పది రోజులపాటు జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జరగనున్న కళాజాత బృందాల కార్యక్రమాలను గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సామాన్యులకు సైతం హెచ్ఐవీ గురించి అర్థమయ్యేలా వివరించి చెప్పడంలో కళాజాత బృందాల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ డి.శ్యామ్‌సన్, జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, కొత్తపేట మహిళ మండలి, సిరి మహిళ సాధికారిత మండలి, మాధురి మహిళ సొసైటీ, లింక్ వర్కర్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ డబ్బాలు, సంచులకు బహిరంగ వేలం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ప్రసాదాల పోటు, అన్నదానం భవనంలో వినియోగించిన పాత సంచులు, ఖాళీ డబ్బాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన వేలంలో ఒడిబియ్యంకు ముగ్గురు కాంట్రాక్టర్లు, ఖాళీ డబ్బాలు, సంచుల వేలానికి నలుగురు కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నారు. సరైన ధర రాకపోవడంతో బహిరంగ వేలం ప్రక్రియను అధికారులు వాయిదా వేశారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం



ఆహుతైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు



మంటల్లో పూర్తిగా కాలిపోయిన నగదు, భూమి కాగితాలు

రూ.లక్షకు పైగా నష్టం

పర్చూరు(చినగంజాం): విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటన గురువారం పర్చూరు నెహ్రూనగర్ కాలనీలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. నెహ్రూనగర్ కాలనీకి చెందిన నల్లబోతుల రాజాకు చెందిన పూరింటిలో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పంటుకుంది. దాంతో పూరిల్లు పూర్తిగా తగులబడటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో ఇంటిలోని నగదు, వెండి ఆభరణాలు, విలువైన కాగితాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి, సకాలంలో అగ్నిమాపక యంత్రం రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు మంటలను ఆర్పి అదుపులోనికి తీసుకొని వచ్చారు. సుమారు రూ.లక్షపైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికుడు దాడి

క్రోసూరు: గుంటూరు నుంచి క్రోసూరు వచ్చే ఆర్టీసీ బస్సులో టికెట్ తీసుకునే విషయంలో ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికుడు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిబాబు గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. ఊటుకూరులో ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కి టికెట్‌కు డబ్బులు ఫోన్ ద్వారా చెల్లించేందుకు ప్రయత్నించగా చెల్లింపు జరగలేదు. గుంటూరుకు చెందిన ఆర్టీసీ బస్ కండక్టర్ అలవాల పుల్లారావు ప్రయాణికుడిని బస్సు దిగమని కోరాడు. దీనిపై ప్రయాణికుడు కండక్టర్ మూతిపై బలంగా గుద్ది బస్సుదిగి వెళ్లిపోయాడు.

కార్మికులకు మెరుగైన వసతులు కల్పించండి



కార్మికుల షెడ్‌లను పరిశీలిస్తున్న అమరావతి అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి ఆయా గుత్తేదారు సంస్థలను ఆదేశించారు. రాజధాని నిర్మాణాలలో పనిచేసేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులకు గుత్తేదారు సంస్థలు కల్పిస్తున్న సదుపాయాలను ఆమె గురువారం క్యాంపులకు వెళ్లి తనిఖీ చేశారు. మొదట తుళ్లూరులోని ఆర్‌వీఆర్ సంస్థ క్యాంపును పరిశీలించారు. ఎండ అధికంగా ఉండటంతో అక్కడ మొక్కలు నాటాలని సూచించారు. కార్మికులకు భోజన వసతిపై ఆరా తీశారు. కార్మికుల కుటుంబ సభ్యులు వచ్చినపుడు నివసించేందుకు ప్రత్యేక వసతి కల్పించాలని, వారి పిల్లలు చదువుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఐనవోలు, శాఖమూరులోని ఎన్‌సీసీ, ఆర్‌వీఆర్ సంస్థల క్యాంపులు పరిశీలించారు.

హోరాహోరీగా ఎడ్ల బండ లాగుడు పోటీలు



రసవత్తరంగా సాగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో ఉన్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోటీలలో భాగంగా న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించిన ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన పోటీలను గురువారం రాత్రి పశుప్రదర్శన కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూ కేటగిరీ విభాగంలో ఎనిమిది జతలు పోటీలో పాల్గొన్నాయన్నారు. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత యజమానులకు అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

నగదు బహుమతుల అందజేత

గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఆరుపళ్ల విభాగం పోటీలలో విజేతలైన ఎడ్ల జత యజమానులకు కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన శ్రీకావ్య నంది బ్రీడింగ్ బుల్స్ నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 15 నిమిషాల వ్యవధిలో 3911.08 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని కావ్యమధు ఎడ్ల జత 3583.2 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం పంగులూరు గ్రామానికి చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్ల జత 3,500 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన గాదే అశోక్ సుమన్‌రెడ్డి ఎడ్ల జత 3,481.8 అడుగుల దూరం లాగి నాలుగవ స్థానం, పల్నాడు జిల్లా నకిరేకల్ మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన మేక అంజిరెడ్డి ఎడ్ల జత 3412.3 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జత 3,313.3 అడుగుల దూరం లాగి ఆరవ స్థానంలో నిలిచాయని తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల చొప్పున నగదు బహుమతులు అందించినట్లు కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, రాంబాబు, విక్రమ్, రాంబాబు, వెంకట్రావ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.